ప్రజాశక్తి

బుధవారం 19 ఫిబ్రవరి 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

హత్య కేసులో

8 మందికి జీవితఖైదు

- ఒంగోలు
- అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్
- సెషన్స్ జడ్జి తీర్పు



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా, జె పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన రత్నంబాబు అనే యువకుడి హత్య కేసులో నిందితులుగా ఉన్న ఎనిమిది మంది నేరస్తులకు జీవిత ఖైదు విధిస్తూ ఒంగోలు అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి రాజావెంకటాద్రి మంగళవారం తీర్పు ఇచ్చారు.

రామకూరు గ్రామానికి చెందిన బూరగ రత్నంబాబు (22) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. అతడు, అదే గ్రామానికి చెందిన షేక్ కరిష్మా ప్రేమించుకున్నారు. ఇది ఇష్టం లేని అమ్మాయి తరపు పెద్దలు ఎన్నోసార్లు నచ్చ జెప్పినా వారు వినలేదు. కరిష్మా తల్లిదండ్రులు వీరి ప్రేమ వ్యవహారం ఇంకా కొనసాగుతుందని కోపగించుకొని ఆమెను 2015 మార్చి 23న ఇంటి నుండి పంపించడంతో రత్నంబాబు వాళ్ళ అమ్మను ఒప్పించి కరిష్మాని తన ఇంట్లోనే ఉంచి మైనారిటీ (తనకు అప్పటికి 17 సంవత్సరాలు) తీరిన తర్వాత పెళ్లి చేసుకుందామని భావించాడు. కరిష్మా రత్నంబాబు ఇంటికి వచ్చిన 15 రోజుల తరువాత ఆమె మూడో మామ నజీరు, నాలుగో మామ మున్నీర్ భాషా అతడి స్నేహితుడు అన్వర్ భాషాలు.. రత్నంబాబు ఇంటికి వెళ్లి జరిగిన విషయాలు వదిలేయాలని, మీ పెళ్లి చేయడానికి మేము అందరం ఒప్పుకున్నామని మాయమాటలు చెప్పి వాళ్ళింట్లోనే మద్యం తాగి పార్టీ చేసుకున్నారు. తరువాత మరలా 2015 ఏప్రిల్ 28న సదరు మున్నీర్ భాషా, అన్వర్‌బాషాలు రత్నంబాబు ఇంటికి వెళ్ళి రేపు ఉదయం 8 గంటలకు జె పంగులూరు మసీదులో వివాహం నిశ్చయించామని, దాని కోసం వలపర్లలో బట్టలు కొనుక్కొస్తామని చెప్పి అదే రోజు సాయంత్రం 4.30 గంటల సమయంలో రత్నంబాబుని రామకూరు ఉత్తరం వైపు పొలాలలోకి తీసుకెళ్లారు. అక్కడ అతడిని కత్తులతో పొడిచి హత్య చేశారు. మరుసటి రోజు ఉదయం ఏడు గంటలకు గ్రామ ప్రజలు రామకూరు రోడ్డుకు ఉత్తరం వైపున పొలాల్లో బూరగ రత్నంబాబు శరీరమంతా కత్తిపోట్లతో, రక్తపుమడుగులో చనిపోయి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రత్నంబాబు తల్లి యేసుదయమ్మ చేసిన ఫిర్యాదు మేరకు అప్పటి మార్టూరు ఎస్ఐ హత్య కేసు నమోదు చేశారు. అప్పటి చీరాల డిఎస్పీ సి.జయరామరాజు కేసు దర్యాప్తు నిర్వహించి ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వాగ్మూలం ఆధారంగా, నేరస్థలాన్ని పరిశీలించి.. ▶ 2లో

కలవరపెడుతున్న వ్యాధులు

- జిల్లాను వణికిస్తున్న 'జిబిఎస్'
- ఇప్పటికే జిల్లాలో ఇద్దరికి సోకిన వైనం
- ఒకరు మృతి..
- మరొకరు కోలుకొని ఇంటికి..
- అందుబాటులో లేని అత్యవసర వైద్యం



జిబిఎస్‌తో మృతిచెందిన మహిళ స్వగ్రామం అలసందలపల్లిలో పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఏదో ఒక జబ్బు సోకి జనం ప్రాణాలు పోతే గానీ అధికార యంత్రాంగం స్పందించడం లేదు. ముందస్తు చర్యలు ఏమీ కనిపించడం లేదు. ప్రస్తుతం జీబిఎస్ వ్యాధి పరిస్థితి ఇదే. కొత్తగా రకరకాల వ్యాధులు జనాన్ని తీవ్రంగా కలవరపెడుతున్నాయి. పాత వ్యాధు లేనంటోన్న వైద్యశాఖ వాటిపై జనాన్ని అప్రమత్తం చేయాల్సిన అవసరం లేదా? అన్నదీ ఆలోచించాలి. ఇప్పటికే కొమరోలు మండలం అలసందలపల్లి గ్రామానికి చెందిన కమలమ్మ అనే 50 ఏళ్ల మహిళ ఈ వ్యాధిన బారినపడి చికిత్స పొందుతూ గుంటూరులో చనిపోయింది. దీంతో వైద్యశాఖ అప్రమత్తమైంది. ఆ గ్రామాన్ని సందర్శించి హడావుడి చేశారు. బేస్తవారిపేట గ్రామానికి చెందిన మరో యువకుడికీ ఇదే లక్షణాలు కనిపించడంతో స్థానిక వైద్యులు అతన్ని ఒంగోలు రిమ్స్‌కు పంపారు. ఇక్కడ పరీక్ష చేసి జీబిఎస్‌గా అనుమానించి గుంటూరు జనరల్ ఆసుపత్రికి పంపారు. అక్కడ అతను కోలుకొని ఇంటికి చేరాడు. ఇంకా ఎంతమందికి ఇలాంటి లక్షణాలున్నాయో చూడాలి. పైకి ప్రమాదకరంగా ఎటువంటి లక్షణాలూ కనిపించవు. సాధారణ ఒళ్లు నొప్పులు వస్తున్నాయి. ఇవి పెరిగి ఇతర భాగాలకు సోకుతున్నాయి. ప్రారంభంలో గుర్తించడం కష్టంగా మారుతోంది. ఈ వ్యాధి సోకితే కాళ్లూ చేతులు చచ్చుబడటం, నరాల బలహీనత, గొంతు పొడిబారిపోవడం, ఆహారం తీసుకోలేకపోవడం వంటి లక్షణాలుంటాయి. రోగనిరోధక వ్యవస్థ, నాడీ వ్యవస్థలను దెబ్బతీయడంతో పాటు కండరాల బలహీనత వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధికి జిల్లాలో వైద్యం అందుబాటులో లేదు. ఏం చేయాలో ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులకూ అంతుచిక్కడం లేదు. ప్రస్తుతం ఒంగోలు రిమ్స్‌లోనూ సరైన వైద్యం లేదు. వెంటనే ఈ లక్షణాలున్న రోగులు వస్తే గుంటూరుకు పంపుతున్నారు. అక్కడ వైద్యులతో పాటు ప్రత్యేక నిపుణులూ ఉన్నందున వైద్యం చేస్తున్నారు. ఆధునిక పరిశోధనలనూ ఈ వ్యాధి చికిత్సకు ఉపయోగిస్తున్నారు. ఎప్పటినుంచో ఉందని వైద్యులు చెబుతున్నా ఈ వ్యాధి సోకే పరిస్థితులు, కారణాలపై అధ్యయనం కనిపించడం లేదు. ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది. వైరస్‌ల వల్లసోకే ఈ వ్యాధి జిల్లాకు కొత్తదిగానే ▶ 2లో

సత్వర వైద్యంతో

కేన్సర్‌ను జయించొచ్చు..

- ఆరోగ్యశాఖ మంత్రి సత్యప్రసాద్ యాదవ్
- ధైర్యంగా ముందడుగు వేద్దాం
- సినీ నటి గౌతమి
- ఏడుగుండ్లపాడులో 11 కేన్సర్ అనుమానిత కేసులు



ఏడుగుండ్లపాడులో స్క్రీనింగ్ పరీక్షల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యప్రసాద్‌యాదవ్, సినీ నటి గౌతమి

ప్రజాశక్తి-మద్దిపాడు

సరైన అవగాహన, సత్వర వైద్యంతో కేన్సర్‌ను జయించవచ్చని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి పెట్టినట్లు చెప్పారు. కేన్సర్‌పై అవగాహన కోసం మండల పరిధిలోని ఏడుగుండ్లపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలు, బహిరంగ సభలో సినీ నటి, లైఫ్ ఎగెయిన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకురాలు గౌతమితో కలిసి ఆయన హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులను ఎదుర్కోవటం నేడు పెద్ద సవాలుగా మారిందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న మరణాల్లో 17 శాతం కేన్సర్‌కు సంబంధించినవేనని అన్నారు. తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారి సంతకాలు చేసిన రెండు ఫైళ్లలో ఒకటి కేన్సర్‌కు సంబంధించినది కాగా, మరొకటి ఆర్.బీ.ఎస్.కే.కు సంబంధించిన ఫైలు అని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే 18 ఏళ్ళు పైబడిన మహిళలందరికీ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా మూడు రకాల కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని గత ఏడాది నవంబర్ 14న ప్రక్రియ ప్రారంభించామన్నారు. నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వారము (సర్వైకల్) కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆరు నెలల్లో 4.7 కోట్ల మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు కేవలం 95 లక్షల మంది మాత్రమే ఈ పరీక్షలు చేయించుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజల్లో అవగాహన లేకపోవడమే దీనికి కారణమని వ్యాఖ్యానించారు. క్యాన్సర్లలో 63 శాతం నివారించుకోవచ్చని, మిగతా 37 శాతం జన్యుపరమైన కారణాల వల్ల నివారణ కష్టమన్నారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 37 వేల మందికి నోటి, 26 వేల మందికి పైగా గర్భాశయ ముఖద్వారం, 25 వేల మంది రొమ్ము క్యాన్సర్ కు సంబంధించిన అనుమానిత లక్షణాలు బయటపడ్డాయన్నారు. ప్రారంభ దశలో గుర్తించగలిగితే కేన్సర్‌ను జయించవచ్చని మంత్రి చెప్పారు. ఏడుగుండ్లపాడు గ్రామంలో 329 మందికి స్క్రీనింగ్ చేయగా 11 కేన్సర్ అనుమానత కేసులను గుర్తించామని, వీటిలో పది నోటికి సంబంధించినవి కాగా, ఒకటి రొమ్ముకు సంబంధించిన కేసు అని తెలిపారు. చివరి దశలో ▶ 2లో

జూదం ఆడిస్తే..

చూస్తూ ఊరుకుంటామా.?

- బాపట్ల ఆఫీసర్స్ క్లబ్ తీరుపై కలెక్టర్ సీరియస్..
- ఆకస్మికంగా తనిఖీ
- విచారణ చేపట్టాలని ఆర్డీవోకు ఆదేశం



రమ్మీ పుస్తకం చూపిస్తూ.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల ఆఫీసర్స్ క్లబ్‌లో జూదం ఆడిస్తే చూస్తూ ఊరుకుంటామనుకుంటున్నారా.? అని క్లబ్ నిర్వాహకులపై జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలో ఆఫీసర్స్ క్లబ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లబ్ లోపల పరిశీలించిన కలెక్టర్ జూదగహంగా మారితే సహించేది లేదని హెచ్చరించారు. గతంలో అలాంటి పరిస్థితి ఉండేదని, తాజాగా ఇప్పుడు లేదని నిర్వాహకులు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. దీంతో ఆయన తీవ్రస్థాయిలో వారిపై మండిపడ్డారు. ఆఫీసర్స్ క్లబ్‌లో అన్ని గదు లనూ నిశితంగా పరిశీలించారు. అక్కడి వాతావరణం చూసి.. రమ్మీ ఆడుతున్నారని కలెక్టర్ నిర్ధారించారు. రమ్మీ ఆడకపోతే ఇక్కడ చేతిరాతతో రాసిన కౌంట్ పుస్తకాలు ఎందుకు ఉన్నాయని నిర్వాహకులను నిలదీశారు. 'మీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే సహించేది లేదు' అని కలెక్టర్ వారిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పుస్తకాన్ని ఆర్డీవో గ్లోరియాకి ఇచ్చి విచారణ జరపాలని ఆదేశించారు. ఆఫీ సర్స్ క్లబ్ ప్రాంగణంలో ధూమపానం చేయ టం వంటి ఇబ్బంది కరమైన వాతావరణం నెలకొని ఉందని కలెక్టర్ అన్నారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను, మున్సిపల్ కమిషనర్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో గ్లోరియా, తహశీల్దార్ సలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం తహశీల్దార్ సస్పెన్షన్

వీఆర్వో, సర్వేయర్ కూడా..

5లో ▲

'విశిష్ట' సంఖ్య కోసం నమోదు చేసుకోవాలి


ప్రజాశక్తి- అమృతలూరు

ప్రభుత్వ అందించే పలు రకాల పథకాలను పొందేందుకు నిర్దేశించిన రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం ప్రతి రైతు నమోదు చేసుకోవాలని ఎఇ ఉయ్యూరు లోకేశ్వరి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్వరి మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి రాయితీ, వ్యవసాయ పరికరాలు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, రాయితీపై సూక్ష్మధాతు పోషకాలు, పంట రుణాలు, వడ్డీపై రాయితీ వంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను రైతులు పొందటానికి తప్పనిసరిగా ఈ 11 అంకెల నంబరు గల విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు. సొంత భూమి కలిగిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కు లింకైన ఫోన్ తీసుకుని సమీపంలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించు కోవాలన్నారు.

ఇంకొల్లు : విశిష్ట నెంబర్ కోసం రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రం వద్ద నమోదు చేయించుకోవాలని ఎఒ వేణుగోపాల్ తెలిపారు. మండల పరిధిలోని భీమవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా 11 అంకెల గల విశిష్ట నెంబర్ కోసం రైతు సేవాకేంద్రంలో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కారంచేడు : ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య తప్పనిసరి అని, ఈ కార్డు ఉంటే వ్యవసాయ సేవలు సులభతరం అవుతాయని ఎఒ కె.సుధీర్ బాబు తెలిపారు. మండల పరిధిలోని కుంకులమర్రు, కారంచేడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ సొంత భూమి కలిగిని ప్రతి రైతుకు ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి, పారదర్శకంగా, మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక గుర్తింపు కార్డులు అంజదేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎటిఎం హారిక, గ్రామ వ్యవసాయ సహాయకులు లలిత, భవాని, జ్యోతి, పాల్గొన్నారు.


అద్దంకి : ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య తప్పనిసరి అని ఎఒ కొర్రపాటి వెంకట కృష్ణ తెలిపారు. మండల పరిధిలోని ధర్మవరం, శంఖవరప్పాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఆధార్,పట్టాదారు పాసు పుస్తకాలు,ఆధార్‌తో లింక్ చేయబడిన ఫోన్‌తో సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు లను కలిసి విశిష్ట సంఖ్యకు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రోజీ ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.



అద్దంకిలో మాట్లాడుతున్న ఎఒ వెంకట కృష్ణ



అమృతలూరులో పంటలు పరిశీలిస్తున్న అధికారులు



ఇంకొల్లులో మాట్లాడుతున్న ఎఒ

కలవరపెడుతున్న వ్యాధులు

(మొదటిపేజీ తరువాయి)

భావించాలి. ఎందుకంటే గతంలో ఈ వ్యాధి ఎవరికీ సోకినట్లు రికార్డుల్లో లేదు. మరణం కూడా సంభవించడం ఆందోళనకరంగా మారింది. పశ్చిమాన ప్రజలు కలవరపాటుకు గురవుతున్నారు. రెండు కేసులూ పశ్చిమ ప్రాంతంలోనే కనిపించాయి. కారణాలపైనా, ఈ ప్రాంతంలో ఈ వ్యాధి సోకడానికి దారితీసిన పరిస్థితులపై తక్షణం అధ్యయనం చేస్తే భవిష్యత్‌లో జాగ్రత్త పడతారు. ఇప్పటివరకూ సీజనల్ వ్యాధుల్లో డెంగీ తీవ్రంగా కలవరపెట్టింది. దోమ కాటు వల్ల సోకే ఈడెంగీ పదేళ్లుగా జిల్లాను వణికిస్తోంది. ఏటా మరణాలు తప్పడం లేదు. పైగా ప్లేట్‌లెట్స్ పడిపోవడానికి దారితీసే ఈ డెంగీ వైద్యం కూడా ఖరీదైందిగా మారింది. రోగుల రోగనిరోధకశక్తిని బట్టి కోలుకోవడం వంటిది ఆధారపడింది. కరోనా తర్వాత మళ్లీ ఇప్పుడు జిల్లాలో జీబీఎస్ అనే కొత్త వ్యాధి కలవరపెడుతోంది. దీనిపై ఇప్పుడు వైద్యశాఖ యుద్ధం చేయాల్సిన అవసరం ఉంది. జిల్లాకు వచ్చిన వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ కూడా దీనిపై పెద్దగా స్పందించలేదు.

అప్రమత్తతతో ముప్పు తప్పించుకోవచ్చు

బాపట్ల జిల్లా: జిబిఎస్ అంటు వ్యాధి కాదని వైద్యులు చెబుతున్నారు. కోడి పేగులలో ఉండే బ్యాక్టీరియా ద్వారా కూడా గులియన్ బ్యారీ సిండ్రోమ్ వ్యాధి మనుషులకు వస్తుందని వెల్లడవుతుంది. అందువల్ల కోడి మాంసం విక్రయించే విక్రయదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. కోడి నుంచి తీసే వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయకూడదు. జలవనరులు కలుషితమయ్యే ప్రాంతాలలో వాటిని ఉంచకూడదు. కలుషితమైన తాగునీరు, కలుషితమైన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకినట్టైతే మూడు రోజులపాటు తగ్గకుండా జ్వరం వస్తుంది. తీవ్రమైన నీరసం, డయేరియా, పక్షవాతం, నరాలు సచ్చుపడటం, చేతి వేళ్లు లేదా కాలు వేళ్ల దగ్గర నుంచి స్పర్శ క్రమేపి కోల్పోవడం వంటివి సంభవిస్తాయి. లక్షణాలు కనపడిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. బ్యాక్టీరియా సోకి వ్యాధిగ్రస్తులైన వారికి ప్రభుత్వం ప్రత్యేక వైద్యం అందించే ఏర్పాట్లు చేశారు. గుంటూరు జిజిహెచ్‌లో, ప్రకాశం జిల్లా ఒంగోలు రిమ్స్ లో ప్రత్యేక కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కోడిలో నుంచి వచ్చే బ్యాక్టీరియా ప్రజలలోకి రాకుండా నివారించడానికి ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సి ఉంది.

తీసుకోవలసిన జాగ్రత్తలు

మొదటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య పరీక్ష చేయించుకోవాలి. ప్రాణాంతకమైన గులియన్ బారీ సిండ్రోమ్ వ్యాధికి గురిగాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, వసతి గహాలలోని విద్యార్థులకు విస్తతమైన అవగాహన కల్పించాలి.

8 మందికి జీవితఖైదు


(మొదటిపేజీ తరువాయి)

సేకరించిన భౌతిక సాక్షాదారాలను విశ్లేషించి హత్యకు కారకులైన తొమ్మిది మంది ముద్దాయిలను అరెస్ట్ చేశారు. అనంతరం నిపుణుల నివేదికను జతచేసి సంబంధిత కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఒంగోలు అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో కేసు విచారణ జరిగింది. బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు బాపట్ల డిఎస్పీ రామాంజినేయులు పర్యవేక్షణలో మార్టూరు సీఐ శేషగిరిరావు, ఒంగోలు జిల్లా కోర్ట్ లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ ఏ.శ్రీనివాసులు, కోర్టు కానిస్టేబుల్ ఏ.కిరణ్‌లు సాక్షులు సరైన సమయంలో కోర్టుకు హాజరై తమ వాగ్మూలం ఇచ్చేలా కృషి చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతకుమారి కోర్టులో వాదోపవాదాలు వినిపించి నిందితులపై మోపబడిన నేరాన్ని తగిన సాక్ష్యాధారాలతో నిరూపించారు. ఒంగోలు అడిషనల్ అండ్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి టి.రాజా వెంకటాద్రి నిందితులు షేక్ మున్నీర్ భాషా , షేక్ అన్వర్ భాషా, షేక్ నజీర్, షేక్ కరిముల్లా, షేక్ బాజీ బుడే , షేక్ సద్దాం హుస్సేన్, షేక్ షకీల, పటాన్ మౌలాలికు జీవితఖైదు, ఒక్కొక్కరికి రూ.5 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం నాడు తీర్పు వెలువరించారు. షేక్ మస్తాన్ అనే నిందితుడు గతంలోనే మరణించారు. ఈ కేసులో నిందితులకు శిక్షపడే విధంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి పోలిస్ అధికారులను, సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చిన మార్టూరు సీఐ శేషగిరిరావు, కోర్టు లైజన్ ఆఫీసర్ ఏ. శ్రీనివాసులు, మార్టూరు కోర్టు పిసి ఏ కిరణ్ కుమార్, ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంత కుమారిలను జిల్లా ఎస్పీ తుషార్‌డూడి ప్రత్యేకంగా అభినందించారు.

సత్వర వైద్యంతో కేన్సర్‌ను జయించొచ్చు..

(మొదటిపేజీ తరువాయి)

కేన్సర్ ఉందని తెలిశాక ఎంత డబ్బు ఖర్చుపెట్టినా ప్రయోజనం ఉండదని, అందుకే ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. తన తల్లి, అక్క కేన్సర్ కారణంగా మరణించినందునే రాష్ట్రంలో ఏ ఒక్క మహిళా కేన్సర్‌తో మరణించకూడదన్న లక్ష్యంతో దీనిపై పెద్దఎత్తున అవగాహన కల్పించేందుకే మంత్రిగా మీ ముందుకు వచ్చానని ప్రకటించారు. కేన్సర్‌ను జయించి ఈ వ్యాధిపై ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లో అవగాహన కల్పిస్తున్న సినీనటి గౌతమిని ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. సినీనటి గౌతమి మాట్లాడుతూ కేన్సర్ అని తెలియగానే నిరాశ, నిస్పహలోకి జారిపోవడం సరికాదని అన్నారు. ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జీవితంలో ఎదురవుతున్న ఎన్నో పోరాటాలలో విజయం సాధిస్తున్న మీకు క్యాన్సర్ పైన విజయం సాధించడం పెద్ద కష్టమేమి కాదని ప్రజల్లో స్ఫూర్తిని నింపారు. 25 ఏళ్ల క్రితం తన తల్లి చనిపోయారని, ఆ బాధలో ఉన్న తనకు మరో నాలుగేళ్లకే రొమ్ము క్యాన్సర్ వచ్చిందని గౌతమి చెప్పారు. అప్పటికి తన కుమార్తె వయసు ఐదేళ్ల లోపేనని అన్నారు. తల్లిని కోల్పోయిన తాను ఆ బాధ తన బిడ్డకు రాకూడదని ధైర్యంతో కేన్సర్‌కు వైద్యం చేయించుకున్నానని తెలిపారు. సకాలంలో పరీక్షలు, సత్వర వైద్యం, మనో ధైర్యంతో కేన్సర్‌పై తాను విజయం సాధించానని తెలిపారు. ఈ దిశగా వైద్య సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు చేసేలా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం ఉన్నందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు అదష్టవంతులని ఆమె వ్యాఖ్యానించారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో 4,07,85,186 మంది 18 ఏళ్లు నిండిన ప్రజలు ఉన్నారని, వీరిలో 94,99,268 మందికి ఇప్పటివరకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. వీరిలో 37 వేలకు పైగా నోటి, 24 వేలకు పైగా రొమ్ము, 26 వేలకు పైగా గర్భాశయ ముఖ ద్వార అనుమానిత కేసులను గుర్తించామన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకునే విషయంలో ప్రజల్లో అపోహలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్ కుమార్ మాట్లాడారు. గ్రామంలో స్క్రీనింగ్ నిర్వహణ శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ కె.శ్యామల, మాజీ శాసనసభ్యులు దారా సాంబయ్య, జిల్లా రెవెన్యూ అధికారి బి. చిన ఓబులేసు, డి.ఎం.హెచ్.వో టి.వెంకటేశ్వర్లు, డి.సి.హెచ్.ఎస్. సూరిబాబు, ఆర్.బీ.ఎస్.కె.డి.పి.ఎం డాక్టర్ భగీరథి, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, స్థానిక సర్పంచ్ శిల్ప సౌందర్య, ఎమ్మార్వో సుజన్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస వరప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు మండవ జయంత్ బాబు, పోతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎంపికలకు హాజరైన విద్యార్థులు

ముగిసిన పవర్ లిఫ్టింగ్ ఎంపికలు

ప్రజాశక్తి- వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, జెఎన్‌టియు కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ బాడి బిల్డింగ్ (పురుష మరియు స్త్రీలు) ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్ యునివర్సిటీ టీం సెలక్షన్స్ విజయవంతంగా ముగిసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా కళశాల ప్రిన్సిపల్ కె. జగదీశ్ బాబు మాట్లాడుతూ శారీరక ఆరోగ్యానికి కషి చేస్తే మానసిక ఆరోగ్యం ధడంగా ఉంటుందని తెలిపారు. అందుకు తగిన విధంగా ప్రతిరోజూ సాధన చేయాలన్నారు. ఇంటర్ కాలేజ్ పోటీలకు జెఎన్‌టియు కాకినాడ పరిధిలోని కళాశాలలలో చదువుతున్న విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు వసతి, భోజనం ఏర్పాట్లు చేసినట్లు కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు, జెఎన్‌టియుకె స్పోర్ట్స్ కౌన్సిల్ మెంబర్ అన్నం శ్రీనివాసరావు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి జెఎన్‌టియుకె కాకినాడ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జి. శ్యామ్ కుమార్ విచ్చేసినట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సి. సుబ్బారావు (అక్రిడిటేషన్), ఆర్‌వి.రమణ మూర్తి (అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్), వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త, మురుగు
దోమలకు నిలయాలుగా మారిన వైనం
విజృంభిస్తున్న వ్యాధులతో ప్రజలు సతమతం
పట్టించుకోని పంచాయతీ, ఆరోగ్య శాఖ

ప్రజాశక్తి-కొండపి

నియోజకవర్గ కేంద్రమైన కొండపి మండలంలోని మూగచింతల, గుర్రపడియ గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. గ్రామాల్లోని వీధులన్నీ అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్యం లోపించి అనేక వ్యాధులు ప్రబలుతున్నాయి. కాలనీలో సైడు కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో నివాస గృహాల నుంచి విడుదలయ్యే మురుగునీరు రోడ్లపైకి వచ్చి దుర్గంధం వెదజల్లుతోంది. నివాస గృహాల మధ్య మురుగునీరు నిలిచి పెద్దగుంతలుగా ఏర్పడి దోమలకు



ప్రధాన రహదారి వెంట నిలిచిన మురుగునీరు

ఆవాసాలుగా మారాయి. కొద్ది చోట ఉన్న సైడు కాలువలలో మురుగునీరు బయటకు వెళ్లే వీలులేక అక్కడే నిలిచి ముక్కుపుటాలు అదిరే విధంగా దుర్గంధం వెదజల్లుతుంది. పారిశుద్ధ్యంపై ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు ఇచ్చినప్పటికీ గ్రామాలలో ఉండే కాలనీల వైపు కన్నెత్తి అయిన చూడకపోవడంతో కాలనీ ప్రజలకు పెనుశాపంగా మారింది. నెలలో మూడవ శనివారం గ్రామాలలో తప్పని సరిగా పారిశుధ్య పనులు చేపట్టాల్సి ఉండగా పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అదే విధంగా నివాస గృహాల మధ్య పిచ్చిమొక్కలు పెరిగి విష పురుగులకు నిలయాలుగా మారి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఏదో ఒక ప్రమాదం జరిగితే తప్ప పంచాయతీ అధికారులు పట్టించుకోరా? అని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

పారిశుధ్య చర్యలు శూన్యం

గుర్రపడియ గ్రామంలో ఎటుచూసినా మురుగునీరు కాలనీని చుట్టి ముట్టింది. ఏ వీధిలో చూసినా నివాస గృహాల నుంచి వచ్చే మురుగునీటితో దర్శనమిస్తున్నాయి.



నివాస గృహాల మధ్య నిలిచిన మురుగునీరు

ఆయా ప్రాంత నివాసాల ప్రజలు నడవడానికి కూడా వీలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు కనీసం బ్లీచింగ్ చల్లిన దాఖలాలు కూడా కనిపించడం లేదు. ఈనెల 15వ తేదీన మూడవ శనివారం నాడు గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారి చేసినా కూడా గుర్రపడియ గ్రామంలో పంచాయతీ కార్యదర్శికి చీమకుట్టినట్టుగా కూడా లేదని ప్రజలు అనుకుంటున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకొని తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కాలువలో పడిపోయిన కారు

కాలువలోకి దూసుకెళ్లిన కారు

ఐదుగురిని రక్షించిన స్థానికులు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ఇంటూరు గ్రామం సమీపంలో మంగళవారం తెల్లవారు జామున కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో మార్నింగ్ వాక్‌కు వెళుతున్న స్థానికులు గమ నించి వెంటనే కారులోని వ్యక్తులను బయటకు తీశారు. ముగ్గురు మహిళలు, ఇద్దరు వ్యక్తులు కారులో ఉండగా, వారందరినీ స్థానికులు కాపాడారు. పంట కాలువపై వంతెన మరియు రోడ్డు మలుపుగా ఉండడంతో పాటు రక్షణ గోడ కూడా లేకపోవడంతో కారు కాలువలోకి తీసుకెళ్లింది. ఎటు వంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు, ప్రయాణి కులు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-పంగులూరు



మృతి చెందిన సుభాష్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడు సమీపంలో మంగ ళవారం రాత్రి జరిగింది. పోలీసులు అందించిన సమా చారం మేరకు రావినూతలకు చెందిన సుభాష్ (19) చందలూరులోని తన పెద్దమ్మ వాళ్ల ఇంటికి వచ్చి తిరిగి రాత్రి 11 గంటల సమయంలో స్వగ్రామం బయలుదేరాడు. బైక్‌పై అతివేగంగా నడుపుతూ కొప్పెరపాడు సమీపంలో రోడ్డు పక్కన ఉన్న స్తంభానికి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ వినోద్ బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-రేపల్లె

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని రేపల్లె ప్రొహిబి షన్ ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. రేపల్లె రూరల్ మం డలం పిరాట్లంక గ్రామంలో మద్యం విక్రయిస్తున్నారన్న సమా చారంతో రేపల్లె ఎక్సైజ్ సిఐ దివాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో అక్రమం గా మద్యం అమ్ముతున్న విశ్వనాథపల్లి శ్రీనివాసరావును అదు పులోకి తీసుకొని అతని వద్ద నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. విశ్వనాథపల్లి శ్రీనివాసరావును అ రెస్టు చేసి కోర్టులో హాజరపరచనున్నట్లు ఎక్సైజ్ సీఐ దివాకర్ తెలిపారు. గ్రామాలలో ఎవరైనా నాటు సారా తయారు చేసినా, అక్రమంగా మద్యం అమ్మినా కఠిన చర్యలు తీసుకుం టామని సిఐ హెచ్చరించారు. గ్రామాలలో అసాంఘిక కార్యక లాపాలు నిర్వహిస్తే తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి-కొండపి

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. మండలంలోని నేతివారిపాలెం గ్రామానికి చెందిన దివి వెంకటేశ్వర్లుకు, కట్టవారిపాలెం గ్రామానికి చెందిన అరికట్ల భార్గవితో కొన్నేళ్ల క్రితం వివాహం అయింది. భార్య పెళ్లి సమయంలో తీసుకొచ్చిన కట్నం సరిపోలేదని, అదనపు కట్నం కావాలని వెంకటేశ్వర్లు, అతని తల్లిదండ్రులు ఇబ్బందులు పెడుతూ, వేధింపులకు గురిచేస్తున్నారని కొండపి స్టేషన్‌లో భార్గవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈ-ఆటోలను పరిశీలించిన మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు



ఆటో నడుపుతున్న మంత్రి

టంగుటూరు మండలం లోని తూర్పు నాయుడు పాలెంలో రిపేరు చేయించిన స్వచ్ఛభారత్ ఈ-ఆటోలను మంత్రి స్వామి పరిశీలిం చారు. ఈ ఆటోలను మంత్రి నడి పి వాటి నాణ్యతను పరి శీలించారు. టీడీపీ హయాం లో గ్రామాల్లో చెత్తను సేక రించేందుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు ఈ ఆటోలు ఇచ్చినట్లు ఆయన తెలి పారు. టిడిపి ప్రభుత్వం ఇచ్చిందన్న కక్షతో గత వైసిపి ప్రభుత్వం వాటిని మూలన పడేసిందని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ ఈ ఆటోలను వినియోగంలోకి తెస్తున్నా మన్నారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం కనీసం 5 మంది దళితులకు కూడా కార్పో రేషన్ ద్వారా రుణాలు ఇవ్వలేదన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

రీసర్వేను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని కొణిజేడులో జరిగిన రీసర్వే సదస్సులో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొని రికార్డులను పరిశీ లించారు. గ్రామంలోని పలువురు రైతులతో మా ట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. తహశీల్దార్ జి.ఆంజనే యులు, వీఆర్వో పి.నరేంద్రబాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్ద దోర్నాల పట్టణంలోని ఐనముక్కల చెంచు కాలనీ లో డోర్ టు డోర్ లీగల్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహిం చారు. ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదే శాల మేరకు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భం గా మార్కాపురం మండల్ లీగల్ సర్వీస్ అథారిటీ టీం లీడర్ వెలుగొండయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్ట ము, న్యాయం గురించి తెలుసుకోవాలన్నారు. చిన్న వయ సులో వివాహాలు చేయడం వలన చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యా యవాది యూసఫ్ ఆలీ, పిఎల్‌వి పూర్ణకంటి తిరుమల య్య, ఏఎన్ఎం కే.నాగలక్ష్మి, ఆయా రేష్మ, ఆశా వర్కర్ బాలనాగమ్మ, సచివాలయ, ఆర్డీటి సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి హామీ నిలబెట్టుకోవాలి

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిఐటి యు జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ అన్నారు. మంగళవారం మార్కాపురంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్లో అంగన్వాడీల వేతనాలు పెం పుదలకు నిధులు ఇవ్వాలన్నారు. అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. అనంతరం ర్యాలీగా బ యలుదేరి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తెలియజేసి తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు జె.నాగరాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు కె.ప్రభావతి, రమా, ఆశాభి, నారాయణమ్మ, కృష్ణవేణి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో 'జార్జి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం సమీపంలోని డాక్టర్ శ్యామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయి లో క్రికెట్ పోటీల్లో రాణించారు. మార్కాపురం పట్టణంలోని ఎస్‌వికెపి కళాశాల మైదానంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎస్ఎస్ఎన్ టోర్నమెంట్‌లో తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ విష యాన్ని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.రాజ బాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన కెప్టెన్ సుబ్బు టీం సభ్యులను, ఫిజికల్ డైరెక్టర్లు జయరావు, విక్రమ్, కోచ్ పోలయ్యలను ఆ కళాశాల సాంకేతిక సలహాదారు, మాజీ మంత్రి డాక్టర్ ఆది మూలపు సురేష్ అభినందించారు. చదువుతో పాటు క్రీడ ల్లోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.




విద్యార్థులను అభినందిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

ఈ సందర్భంగా విజేతలకు రూ.5 వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ మేరకు విజేతలను ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక బృందం అభినందించింది.

బాలోత్సవంలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు



బహుమతులు సాధించిన పూజా వైష్ణవి, శివకార్తీక

ఆదివారం ఒంగోలులో జరిగిన బాలోత్సవంలో కనపర్తి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 9వ తరగతి చదువుతున్న కోమట్ల పూజా వైష్ణవి ఏకపాత్రాభినయంలో తృతీయ స్థానం సాధించింది. వ్యాసరచన, చిత్రలేఖనంలో అక్కెల శివకార్తీక రెండింటిలో ద్వితీయ స్థానం సాధించింది. ప్రతిభ కనపరచిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు కె.ఝాన్సీలక్ష్మి ని హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు ప్యాడ్లు అందజేత

ప్రజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మార్కాపు రం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాతలు పెరుమాళ్ళ బాల మోహన్‌రావు, కసెట్టి జగన్ బాబు, అరికట్ల వెంకట నారాయణ రెడ్డి మరికొందరు దాతల సహకారంతో ఉచి తంగా 400 పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 అచ్యుత సుబ్బారావు, లైన్స్ క్లబ్ ఆఫ్ మార్కాపూర్ ప్రెసిడెంట్ టి.రామకృష్ణారావు, ప్రధా నోపాధ్యాయులు ఎం.సుధాకర్, స్వామి కుమార్, ఆదినారా యణ, అజీమ్ భాష, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, శ్రీనివాసరావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ మారుతీదేవి మరియు పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ నేత లక్ష్మణరావును గెలిపించాలి

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం

ప్రజాశక్తి - రేపల్లె

రాజకీయాలకు అతీతంగా ప్రజాగొంతుకగా ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును ఎమ్మెల్సీగా గెలిపించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి కోరారు. లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ రేపల్లె పట్టణంలోని ప్రభుత్వ,ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ శాసనమండలిలో పట్టభద్రుల, ఉపాధ్యాయుల కోసం పది స్థానాలు కేటాయించినట్లు తెలిపారు. ఆ స్థానాల్లో బలమైన కార్పొరేట్ వ్యక్తులు కూడా పోటీచేస్తున్నారని తెలిపారు. వారు ఉద్యోగులు,



బాపట్లలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



రేపల్లెలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి

ఉపాధ్యాయులు, కార్మికులు నిరుద్యోగులు, రైతాంగం, పెన్షనర్ల హక్కులు కాపాడటానికి కాకుండా వారి రాజకీయ ఎజెండాను అమలు చేయటానికి మాత్రమే పూనుకుంటారు. అందుకు భిన్నంగా గత 14 సంవత్సరాలుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు శాసనమండలిలో ప్రజలగొంతికగా అనేక అంశాలపై మాట్లాడతున్నట్లు తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు ,నిరుద్యోగులు, రైతాంగ పోరాటాలలో నేరుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పాల్గొంటూ ప్రజల గొంతుకగా నిలుస్తున్నారు. విడిపోయిన ఆంధ్రరాష్ట్రం అభివృద్ధి కోసం వివిధ సలహాలు, సూచనలు ఇవ్వడంలో కీలకపాత్ర పోషించాల్సిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు గెలవడం చారిత్రాత్మక అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాలు నాయకులు, సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షుడు సి.హెచ్. మణిలాల్,ఎస్ఎఫ్ఐ నాయకులు వై. నవీన్, పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ వై. కిషోర్, డివైఎఫ్ఐ, సిఐటియు నాయకులు బిఎల్కె. ప్రసాద్, కె.వెంకట్, కె.ఆశీర్వాదం, కె. రమేష్, డి.ఆగస్టిన్, కెవి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

బాపట్ల : పాలక పక్షాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసేందుకు పోరాటపటిమ కలిగిన నాయకుడు కెఎస్.లక్ష్మణరావును ఎమ్మెల్సీగా గెలిపించుకోవాల్సిన అవసరముందని సిఐటియు జిల్లా నాయకులు ఎం .కొండయ్య తెలిపారు. మండల పరిధిలోని వెదుళ్ళపల్లి లో ఎమ్మెల్సీ లక్ష్మణరావు గెలిపించాలని కోరుతూ మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్లు, నిరుద్యోగ, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ ప్రజా సంఘాల, బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి, నిరంతరం కార్మికులకు ఉద్యోగులకు ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండి ప్రజల కోసం పోరాటం చేసే వ్యక్తి లక్ష్మణరావు అని తెలిపారు. అధికారం ఉన్నా లేకపోయినా కార్మికుల కోసం ఉద్యోగుల కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం నిత్యం పోరాడే ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వై.భాస్కరరావు, కె.నాగేశ్వరరావు, అనిల్, కోట వెంకటేశ్వర్ల రెడ్డి పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డిగా రవిశంకర్

ప్రజాశక్తి- అమృతలూరు



అమృతలూరు మండల ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డిగా మాకినేని రవిశంకర్ మంగళవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన ప్రస్తుతం నిజాంపట్నం మండల పంచాయతీ విస్తరణాధికారిగా పనిచేస్తున్నారు. మాకినేని రవిశంకర్ పంచాయతీ కార్యదర్శిగా అత్యంత సమర్థవంతంగా పనిచేసిన చరిత్ర ఉంది. గతంలో చెరుకుపల్లి మండలం కావూరు, భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామపంచాయతీ లకు కార్యనిర్వహణాధికారిగా పనిచేశారు. అనంతరం చేబ్రోలు మండలం, తెనాలి మండలాల్లో పనిచేశారు. అనంతరం ఇఒపిఆర్‌డిగా ఉద్యోగోన్నతి పొందారు. నిజాంపట్నం మండల ఇఒపిఆర్‌డిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం అమృతలూరు మండల ఇఒపిఆర్‌డిగా అదనపు బాధ్యతలు స్వీకరించనున్నారు. అమృతలూరు ఇఒపిఆర్‌డి మరియు ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒగా పనిచేసిన నరసింహారావు ఇటీవల గుండెపోటుతో మతి చెందిన విషయం విదితమే. ఆయన స్థానంలో రవిశంకర్ బాధ్యతలు చేపట్టనున్నారు.

సినీ నిర్మాత విజయలక్ష్మి కన్నుమూత

ప్రజాశక్తి బాపట్ల



విజయలక్ష్మి (ఫైల్)

బాపట్లకు చెందిన సినీ నిర్మాత శీరం విజయలక్ష్మి(75) మంగళవారం కన్నుమూశారు. చిరంజీవి సినీ ప్రస్థానం ప్రారంభమవుతున్న తొలి రోజుల్లో 1978లో సినీ రంగ ప్రవేశం చేసిన చిరంజీవితో 1980 లో రక్తబంధం సినిమా తీశారు. విజయలక్ష్మి ది చీరాల మండలం ఈపురుపాలెం పుట్టిల్లు. బాపట్ల కోడలైన విజయలక్ష్మి తీసిన రక్త బంధం సినిమా హిట్ కావటంతో సినీ పరిశ్రమలో చిరంజీవికి అనేక అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. ఆతర్వాత పాతికేళ్లపాటు తిరుగులేని నటుడిగా చిరంజీవి రాణించారు. రక్త బంధం సినిమా నిర్మాతగా మంచి గుర్తింపు పొందిన శీరం విజయలక్ష్మి మృతి పట్ల పలువురు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.



బుచ్చేశ్వరరావును సన్మానిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

బుచ్చేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని దేవాంగపురికి చెందిన ప్రముఖ చేనేత వ్యాపారి మరియు సీనియర్ టిడిపి నాయకులు శిద్ది బుచ్చేశ్వరరావును బట్ట మోహన్‌రావు పుష్పవలి, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ ట్రస్ట్ స్థాపించినప్పటి నుంచి ప్రతి మంగళ,శనివారాల్లో జంద్రపేట దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నదానం ఐదో సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా దేవాంగపురి శివాలయంలో వేటపాలెం పట్టబద్ధుల సంఘం అధ్యక్షులు వెంకట సుబ్బారావు, చేనేత వ్యాపారి సిద్ది వెంకట బుచ్చేశ్వరరావు, జీడిపప్పు వ్యాపారవేత్త కొత్త శ్రీనివాసరావును ట్రస్ట్ నిర్వాహకులు సత్కరించారు.ఈ సందర్భంగా చేనేత వస్త్ర వ్యాపారి బుచ్చేశ్వరరావు మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపం అని సేవా కార్యక్రమాల్లో అన్నదానం గొప్పదని కొనియాడారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావును సన్మానించారు.ఈ కార్యక్రమంలో వేటపాలెం రోటరీ అధ్యక్షుడు సురేష్ బాబు. మాజీ అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరావు. కారంచేటి శివరామకష్ణ, షేక్ యూసుఫ్, డాకా రమణారెడ్డి, పూర్ణచంద్రరావు, శ్రీనివాసరెడ్డి, సోడియం శ్రీనివాసరావు, గుత్తి పరంజ్యోతి, సీతారామయ్య, ట్రస్ట్ చైర్మన్ బట్ట మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కొల్లూరు

ప్రభుత్వ పాఠశాలల ద్వారా నైతిక విలువలు, రాజ్యాంగ విలువలు కాపాడబడతాయని, తల్లిదండ్రులకు ప్రభుత్వ బడిపట్ల నమ్మకాన్ని కలిగించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే బాధ్యతను ప్రభుత్వ ఉపాధ్యాయులు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా పాఠశాలల సంఖ్యను కుదించే ప్రయత్నాన్ని చాప కింద నీరులా చేస్తున్నట్లు తెలిపారు. దీన్ని యుటిఎఫ్ వ్యతిరేకిస్తుందన్నారు. 60 మంది విద్యార్థులు దాటిన ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్చి మిగిలిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలుగా యథాతంగా కొనసాగించాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల సమయంలో బోధనేతర కార్యక్రమాలు ఎక్కువవ్వాయని, వీటిని రద్దు ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే అవకాశం కలుగుతుందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రభుత్వ రంగాల విభాగం చైర్మన్ మాట్లాడుతూ 2007 నుంచి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల పక్షాన నిలబడి నిరంతరం వారి సమస్యలు పరిష్కారంతో క్రియాశీలకముగా వ్యవహరిస్తున్న ప్రస్తుత పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును తిరిగి 2025 శాసన మండలికి పోటీ చేస్తున్నారని, ఆయన్ని తప్పకుండా గెలిపించాలని కోరారు. బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. శ్రీనివాసరావు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి చైర్మన్ నియమించాలన్నారు. ఆర్థిక బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్య దర్శి వినోద్‌బాబు, మండల ప్రధాన కార్యదర్శి డేవిడ్ లివింగ్ స్టన్, సీనియర్ నాయకులు పరిశుద్ధరావు ,శ్రీనివాసరావు ,బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు




కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిల్వ ఉంచిన ఆహారం తినొద్దు : కమిషనర్

ప్రజాశక్తి బాపట్ల

నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకుండా ఎప్పటికప్పుడు ఇంట్లో తయారు చేసిన వేడివేడి ఆహారాన్ని తీసుకొని గులియన్ బ్యారే(జిబి) సిండ్రోమ్ వ్యాధి భారిన పడకుండా పట్టణ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న జిబి సిండ్రోమ్ వ్యాధిని దరిచేరనీయకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అందుకు ఆహార నియమాలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. బయట మార్కెట్లో విక్రయించే ఆహార పదార్థాలను



మాట్లాడుతున్న కమిషనర్

తినకుండా ఇంట్లోనే ఎప్పటికప్పుడు వేడివేడి ఆహార పదార్థాలను తయారు చేసుకొని తినాలన్నారు. నీటిని ఎప్పటికప్పుడు వేడి చేసుకొని తాగాలన్నారు. ప్రజలు ఆహార విషయంలోనే అత్యంత జాగ్రత్తలు పాటిస్తేనే ఈ వ్యాధి సోకదన్నారు. దేశవ్యాప్తంగా దీనిపై సర్వే చేసిన వైద్యులు సైతం కలుషిత ఆహారం వల్లే ఈ వ్యాధి సోకుతుందని నిర్ధారణకు వచ్చారన్నారు. అందుకు అనుగుణంగా ప్రజలు నిల్వ ఉంచిన ఆహారం తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్నారులకు అందించే ఆహారం పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రీసర్వే పరిశీలన

ప్రజాశక్తి- కారంచేడు

మండల పరిధిలోని ఆదిపూడి గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీసర్వేను చీరాల ఆర్‌డిఒ చంద్రశేఖర్ నాయుడు మంగళవారం పరిశీలించారు. గత నెల రోజులుగా ఆదిపూడి గ్రామంలో రీసర్వే నిర్వహిస్తున్నారు. ఈగ్రామ పరిధిలో మొత్తం 4,700 ఎకరాలు ఉనానయి. మంగళవారం నాటికి సుమారుగా 1300 ఎకరాలు సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ రీ సర్వే కార్యక్రమాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. రైతులు, ప్రజల సమక్షంలో సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులు కూడా సర్వే అధికారులకు అందుబాటులో ఉండి రీ సర్వేకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు నాగరాజు, డిప్యూటీ తహశీల్దారు అనిత, డివిజన్ సర్వేయర్ మునెయ్య, ఆర్ఐ జగదీష్ బాబు , పంచాయతీ కార్యదర్శి కష్ణ, విఆర్ఒ ముత్తయ్య, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

0 నుంచి 6 సంవత్సరాల పిల్లల కోసం ఉచిత ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. మంగళవారం నుంచి ఉచిత ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలోని కనగాల, గుల్లపల్లి, రాంబోట్లపాలెం సచివాలయాలలో ఉచిత ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఆరు సంవత్సరాల లోపు గల బాల బాలికలకు ప్రత్యేక ఆధార్ శిబిరాల ద్వారా ఆధార్ నమోదు చేయించుకోవాలన్నారు. పుట్టిన తేది ధ్రువీకరణ పత్రం తీసుకెళ్లి ఆధార్ నమోదు చేయించుకోవాలన్నారు. ఉచిత ఆధార్ క్యాంప్‌ను చిన్నపిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ తెలిపారు.

కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి మండలం చినకొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఈశ్వర్ రెడ్డి ఇటీవల సాధారణ బదిలీల్లో సంతమాగులూరు మండలం పాత మాగులూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు. అయితే గతంలో చిన కొత్తపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల గోల్ మాల్ విషయంలో ఈశ్వర్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తాగునీరు, పారిశుధ్యానికి

కేటాయింపులు పెంచాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

రూ.210.79 కోట్లతో రూపొందించిన ఒంగోలు కార్పొరేషన్ బడ్జెట్ కు సంబందించి దామాషా ప్రకారం తాగునీరు, పారిశుధ్యానికి నిధులు కేటాయించాలని సిపిఎం నగర కార్యదర్శి డిమాండ్ చేశారు. బుధవారం నాడు కౌన్సిల్ లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ పై ఆయన స్పందించారు. నగర శివారుల్లోని 16 కాలనీలలో రోజుకు 165 చొప్పున ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు.తాగునీటి సరఫరా కు కేటాయించిన రూ. 2 కోట్లు సరిపోవవని, దామాషా ప్రకారం అదనంగా మరో రూ 2కోట్లు పెంచాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ లో రూపొందించినట్లు నీటి సరఫరాకు ఏటా రూ 5 కోట్లు ట్యాంకర్లకు ఖర్చు చేయడం కంటే ఆయా ప్రాంతాలకు శాశ్వత ప్రాతిపదికన పైప్ లైన్లు ఏర్పాటు చేయడం, ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి తద్వారా సమస్యకు పరిష్కారం చూపొచ్చన్నారు. పాలకవర్గం ఆ దిశగా కృషి చేయాలన్నారు.

స్లమ్ ఏరియాలలో మౌలిక సదుపాయాల కోసం కేటాయింపులు నామ మాత్రంగా కేటాయించినట్లు పేర్కొన్నారు. పారిశుధ్య పనులకు సంబందించి కార్పొరేషన్ పరిధి లో రోజూ ఉత్పత్తి అవుతున్న 135 టన్నులు చెత్త ను తొలగించడం లో వాహనాల మరమ్మత్తుల పేరుతో పూర్తిగా తొలగించడంలేదన్నారు. అయితే బడ్జెట్ లో రూ 4 కోట్లు కేటాయించడం పట్ల సందేహం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద మొత్తం లో ఖర్చు చేస్తున్నా చెత్త పేరుకుపోవడం పట్ల అక్షేపణ వ్యక్తం చేశారు.గత మూడేళ్లుగా పని చేస్తున్న 150 మంది పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం రూ.12000 ఇస్తున్నారని, జీవో ప్రకారం 15 వేల రూపాయలు వేతనం చెల్లించాలన్నారు. తదనుగుణంగా నిధులు కేటాయించాలన్నారు.అలాగే నగరంలో మౌళికసదుపాయల అభివద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

యర్రగొండపాలెం తహాశీల్దార్ సస్పెన్షన్

వీఆర్వో, సర్వేయర్ కూడా..

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలో తహాశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఏ బాలకిషోర్‌తో పాటు యర్రగొండపాలెం-2 వీఆర్వో యల్లయ్య, సర్వేయర్ దిలీప్ అక్రమంగా ఒకరి భూమి మరొకరికి ఆన్‌లైన్ చేసేందుకు ధ్రువీకరించారు. కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్ ఇటీవల యర్రగొండపాలెంలో వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. ఇతర రెవెన్యూ సిబ్బందితో స్టేట్‌మెంట్లు స్వీకరించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కి అందజేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ ముగ్గురిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశాలు జారీ చేశారు. యర్రగొండపాలెం పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లా ఎదుట జాతీయ రహదారి 565 నుంచి కొలుకుల రోడ్డుకు వెళ్లే సర్వే నెంబర్ 559లో రెండు ఎకరాలు ఆర్అండ్‌బి స్థలం ఉంది. ఈ భూమిలోని కొంత భాగంలో ఆర్ఎంబి అధికారులు సీసీ రోడ్డు వేయగా మిగతాది అంచుల కింద ఉండిపోయింది. బంగ్లా ఎదురుగా రోడ్డుకి ఉత్తరం వైపున ఖాళీ స్థలం గతంలోనే పంచాయితీ తాగునీటి బోరు, నీటి ట్యాంకు ఏర్పాటు చేసింది. మిగతాది ఖాళీగా ఉంది. ఎఫ్ఎంబి ప్రకారం బంగ్లా ప్రహారి నుంచి 117 లింకులు వెడల్పుతో రహదారి విస్తరించి ఉంది. అటు జాతీయ రహదారి, ఇటు ఆర్అండ్‌బి సిసి రోడ్డుకు మలుపులో ఉండటంతో దీని విలువ లక్షల్లో ఉంది. దీంతో కొందరి కళ్ళు ఈ భూమిపై పడ్డాయి. పక్కనున్న 58/1 సర్వే నెంబర్‌తో ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు. వీటిపై గ్రామ సర్వేయర్, విఆర్వో, పంచాయతీ కార్యదర్శి, తహాశీల్దార్‌లు సంతకాలు చేసి సీలు వేశారు. సదరు పత్రాలు ఆధారంగా దొడ్డపనేని శ్రీనివాస్ అనే వ్యక్తి తన భార్య పేరుపై గత నెల 22వ తేదీన గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. విషయం బయటికి పొక్కడంతో అసలు హక్కుదారుల వారసులు తప్పుడు పత్రాలతో తమ విలువైన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో పాటు, జిల్లా కలెక్టర్‌ని కలిశారు. దీంతో తీగ లాగితే డొంకంతా కదిలింది. ఈ క్రమంలో బాధ్యులైన తహాశీల్దార్, సర్వేయర్, వీఆర్వోలను సస్పెండ్ చేశారు. కాగా ఈ వ్యవహారంలో మరికొందరు సస్పెండ్ అవుతారనే ప్రచారం జరుగుతోంది.

విద్యుత్ మీటర్ రీడర్స్

మహాసభలు జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మార్కాపురం

'ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్' రాష్ట్ర ప్రథమ మహాసభలు ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రారంభం కానున్నాయి. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో వాల్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా కార్యదర్శి షేక్ ఖాశిం మాట్లాడుతూ మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మీటర్ రీడర్లను విద్యుత్ సంస్థలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం ఇవ్వాలని కోరారు. విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలపై ఈ మహాసభలో చర్చ జరగనుందన్నారు. ఉపాధి కోల్పోకుండా



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రత్యామ్నాయ ఉపాధి కోసం మహాసభలో తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. ఈ మహాసభలో విద్యుత్ మీటర్ రీడర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో దుప్పట్ల కాశయ్య, బొప్పరాజు నారాయణ, పి సతీష్ కుమార్, డి సుబ్రహ్మణ్యం, సుబ్బు, షేక్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ పరీక్షా కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఎం.బి.ఏ మూడో సెమిస్టర్ పరీక్షా కేంద్రాన్ని ఆంధ్ర కేసరి యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి హరిబాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా లోని కందుకూరు వివేకా డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు కు పలు సూచనలు చేశారు.. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవకతవకలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. పరీక్షలు నిర్వహణ పై సంతృప్తి వ్యక్తం చేశారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మాగుంట

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ఎంపీ మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పార్టీ నాయకులు, మాగుంట అభిమానులతో మాట్లాడారు. ఇటీవల బైపాస్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేసుకున్న ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి నెల్లూరులోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఒంగోలు ఎంపి కార్యాలయంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డిని ఆయన అభిమానులు, పార్టీ నాయకులు పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఆయురారోగ్యాలు బాగుండాలని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో ఒంగోలుకి తిరిగి రావాలని వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలో పేర్నమిట్ట, అంబేద్కర్ నగర్, ఈనాడు ఆఫీసు, ప్రతిభ కాలేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, టొబాకో బోర్డు, ద్వారకా నగర్, సమతానగర్, పీర్లమాన్యం, మంగమూరు ఆశ్రమం, కామేపల్లివారిపాలెం తదితర ప్రాంతాలలో బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి.పాండురంగారావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జాగరూకతతో ఓటు వేయాలి..

జిల్లా ఎన్నికల అధికారి వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటర్లు అత్యంత జాగరూకతతో ఓటు వేయవలసి ఉంటుందని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి జె వెంకట మురళి చెప్పారు. ఓటర్లు ప్రథమ ప్రాధాన్యతా ఓటును నమోదు చేయనట్లయితే వారి ఓటు చెల్లుబాటు కాదన్నారు. మంగళ వారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటింగ్ విధానంపై ఎన్నికల నిఘావేదిక వారు ప్రచు రించిన కరపత్రాలను ఆయన కలెక్టరేట్ లో ఆవిష్కరించారు. ఓటును అంకెలలో కాకుండా, అక్షరాలలో నమోదు చేసినా కూడా ఆ ఓటు చెల్లుబాటు కాదని ఆయన వివరించారు. పోలింగ్ అధికారులు అందజేసే వైలెట్ కలర్ స్కెచ్ పెన్నును మాత్రమే అంకెలు వేయడానికి ఉపయోగించాలి. ఒకే అభ్యర్థికి ఎదురుగా 1 మరియు 2లను కూడా నమోదు చేసేటట్లయితే అటువంటి ఓటు కూడా చెల్లుబాటు కాకుండా పోతుందని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి గంగాధర్‌గౌడ్, ఎన్నికల నిఘా వేదిక జిల్లా కన్వీనర్ డాక్టర్ పిసి సాయిబాబు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

జిబిఎస్ నివారణపై

ప్రజలలో అవగాహన కల్పించాలి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గులియన్ బ్యారి సిండ్రోమ్ వ్యాధి వ్యాప్తిపై మంగవారం నాడు అధికారులతో స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ వెంకటమురళి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రాణాంతకమైన గులియన్ బ్యారి సిండ్రోమ్ వ్యాధికి జిల్లా వాసులు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలుషితమైన తాగునీరు, కలుషితమైన ఆహార పదార్థాలు తీసుకోవడంతోనే వ్యాధి వస్తుందని చెప్పారు. వ్యాధి లక్షణాలు గుర్తించడంపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి లక్షణాలు కనపడిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సరఫరా చేసే తాగునీటిని మరింతగా శుభ్రపరచాలని అధికారులను ఆయన ఆదేశించారు. బాగా కాచి, వడకట్టి, చల్లార్చిన నీటినే తాగాలని గ్రామాల్లో బీటా టామ్ టామ్, మైక్ లు, మీడియా ద్వారా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెరువులలో తాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువుల దగ్గర నుండి త్రాగు నీటిని ప్యూరిఫైయర్ చేసే ప్రదేశం వరకు నీటిని తరలించే కాలువలలో మత కలేబరాలు, మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాటర్ ట్యాంకులను పూర్తిగా ఎండబెట్టి వాటిని క్లోరినేషన్ చేసిన తర్వాత నీటిని నింపాలని అధికారులకు సూచించారు. చెరువుల దగ్గర పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఎస్ ఈ రూరల్ వాటర్ సప్లై అనంతరాజు, బాపట్ల, చీరాల,అద్దంకి, రేపల్లె మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రికి నర్సింగ్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఒంగోలుకు వచ్చిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిని అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నర్సింగ్ సిబ్బంది డ్యూటీ లో ఇబ్బందులు పరిష్కరించాలని, పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ సూచనల మేరకు 24 గంటలు పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 4 వ స్టాఫ్ నర్సెస్ పోస్టును నియమించాలన్నారు. కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలన్నారు. పదోన్నతులు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపి ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు మోపిదేవి ఉదయ లక్ష్మి, కార్యదర్శి కొత్తపల్లి మంజేష్, కార్యవర్గ సభ్యులు జానీ బాషా, మహేష్, మహబూబ్, బివి రామలక్ష్మి, నాగరాజ కుమారి , రమణ నాయక్, కాంట్రాక్ట్ నర్సింగ్ రాష్ట్ర కమిటీ సభ్యులు సుమన్, స్మిత మోల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు, రేపు పోస్టాఫీసుల్లో మెగా మేళా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం తపాలా డివిజన్ పరిధి లోని అన్నీ పోస్టాఫీసులలో తపాలా జీవిత భీమా (పిఎల్ఐ), గ్రామీణ తపాల' జీవిత భీమా (ఆర్‌పిఎల్ఐ) మెగా మేళా ను ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ ఎమ్‌డి జాఫర్ సాధిక్ తెలిపారు. ఈ మేళా లో 1000 మందికి కొత్తగా తపాలా జీవిత బీమా కవరేజ్ ను అందించాలని, కోటి రూపాయల ప్రీమియం సమీకరణే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. పోస్టాఫీసులలో జీవిత బీమాతో తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్ తో పాలసీలు పొందవచ్చునని తెలిపారు. గ్రామీణ తపాలా బీమాను గ్రామీణ ప్రజలందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. ఒకప్పుడు కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితమైన తపాలా జీవిత భీమా నేడు పట్టభద్రులందరికి (డిప్లొమా, డిగ్రీ, ఐటిఐ) అందుబాటులోకి వచ్చిందన్న విషయాన్ని ప్రజలందరూ గమనించి సమీపంలోని అన్నీ పోస్టాఫీసులలో ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

పర్యాటక కేంద్రంగా 'భైరవకోన' అభివృద్ధికి కృషి

కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

ప్రజాశక్తి-సిఎస్.పురం

జిల్లాలో ప్రముఖ పర్యాటక పుణ్యక్షేత్రమైన భైరవకోనను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. భైరవకోనలో మహాశివరాత్రి ఉత్సవాల గురించి అధికారులతో మంగళవారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని ఆదేశించారు. భైరవకోనను మంచి క్షేత్రంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. రాబోయే రోజుల్లో రూ.2కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అధికారులు బృందాలుగా ఏర్పడి అన్ని వసతులు సమకూర్చాలని అన్నారు.



మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

అనంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. భక్తుల నడక మార్గంలో రాళ్లగుట్టలను తొలగించాలని చెప్పారు. రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలకు జంగిల్ క్లియరెన్స్ చేయాలని చెప్పారు. మహిళా భక్తులకు ప్రత్యేక టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. బస్సు పార్కింగ్, పొంగళ్ళు తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు. జలపాతాన్ని సందర్శించి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఇఒ వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ళ శ్యామ్‌సుందర్‌రాజు, కనిగిరి ఆర్‌డిఓ కేశవర్ధన్‌రెడ్డి, డిఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, డిఎల్‌డిఓ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్, ఎలక్ట్రికల్, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, మండల పరిషత్, రెవిన్యూ తదితర శాఖ అధికారులు, టిడిపి నాయకులు బోయల నారాయణరెడ్డి, నాగిశెట్టి చిన్నమాల కొండయ్య, బొబ్బురి రమేష్, బత్తుల వెంకటాద్రి, మన్నేపల్లి శ్రీనివాసులు, గుంటిమడుగు వెంకటరామరాజు, చెరుకుపల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు

జీతాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం


మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛభారత్ కింద పని చేసే కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలని స్వచ్ఛభారత్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. రెండేళ్లుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వెంటనే పెండింగు జీతాలు చెల్లించాలని కోరారు. కార్మికులకు సబ్బులు, నూనె, రక్షణ పరికరాలు సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల గౌరవ అధ్యక్షులు ఎస్ తిరుపతిరెడ్డి, ఎ దయానందం, సంగటి భాస్కర్, చిన్నయ్య, కుక్కల వెంకటేశ్వర్లు, నందిపోగు జాన్ పాల్గొన్నారు.


వృద్ధులకు అన్నదానం చేస్తున్న టిడిపి నాయకులు

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-దర్శి

తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ మామయ్య, డాక్టర్ కడియాల లలిత సాగర్ తండ్రి తెలుగుదేశం డాక్టర్స్ సెల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా స్థానిక కురిచేడు రోడ్‌లోని షిరిడి సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కేక్ కటింగ్ చేసి పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, దారం సుబ్బారావు, నాదెండ్ల అంజయ్య, గొర్రె సుబ్బారెడ్డి, కర్ణ శ్రీను, పుల్లలచెరువు సత్యనారాయణ, చిన్న సానే సుబ్బయ్య పాల్గొన్నారు.


తహాశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కార్యకర్తల వినతి

ప్రజాశక్తి - కురిచేడు

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సమ్మె హామీలు అమలు చేయాలని కోరుచూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో వైఆర్ జడ్‌పి ఉన్నత పాఠశాల నుంచి ప్రదర్శన నిర్వహించి తహాశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తహాశీల్దారు బి రజినికుమారికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు షేక్ ఫాతిమా, ఎన్ విజయరాణి, ఎం రాజ్యలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

తారకరత్నకు ఘన నివాళి

ప్రజాశక్తి-దర్శి

టిడిపి నాయకులు, సినీ నటులు నందమూరి తారకరత్న ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఘనంగా మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడారు. తారకరత్న భౌతికంగా లేకపోయినప్పటికీ పార్టీలో ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు.

విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న సిఎస్‌పురం ఎఒ సంపత్‌కుమార్

ప్రజాశక్తి-సిఎస్ పురం

సాగు భూమి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి బి సంపత్ కుమార్ తెలిపారు. మండలంలోని దర్శిగుంటపేట, కొత్తపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. ప్రస్తుతం వరి పంటలో కాండం తొలిచే పురుగు గమనించినట్లు ఎఒ తెలిపారు. దీని నివారణకు తీసుకోవలసిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ రబీ సీజనకు సంబంధించి సాగు చేసిన ప్రతిపంట తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని అన్నారు. పంట నమోదు పూర్తి అయిన తర్వాత సాగు చేసిన పంట, సర్వే నెంబరు ఖాతా నెంబరు, విస్తీర్ణం ఒకసారి సరిచూసుకుని వేలిముద్ర వేసి ధ్రువీకరించాలని అన్నారు. సాగు భూమి ఉన్న రైతు తప్పనిసరిగా ఈనెల 24లోపు ఫార్మర్ రిజిస్ట్రరీలో నమోదు చేసుకోవాలని అన్నారు. భూ ఆధారిత రైతు పథకాలైన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీ పైన వ్యవసాయ పనిముట్లు తదితర పథకాలకు నేరుగా పొందే వీలు కలుగుతుందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే సత్వర పరిహారం పొందాలన్నా కూడా తప్పనిసరిగా ఈ గుర్తింపు సంఖ్య ఉండాలని తెలిపారు. నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవడంలో తోడ్పడుతుందన్నారు. కావున రైతులు ఆధార్ నెంబరు, ఆధారు నెంబర్‌కు లింక్ అయిన ఫోను నెంబరు, పట్టాదారు పాస్‌పుస్తకం లేదా 1బి తీసుకొని మీకు దగ్గరలోని రైతు సేవా కేంద్రం దగ్గరకు వెళ్ళినట్లయితే ఫార్మర్ రిజిస్టరీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎఇఒ పావలి శ్రీనివాసులు, విఎఎ అనూష, ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాళ్ళూరు : మండలంలోని మల్కాపురం, రజానగరం, విఠలాపురం గ్రామాల్లో వ్యవసాయ అధికారి బి ప్రసాదరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో 1335 ఎకరాలలో కంది సాగు చేపట్టారని తెలిపారు. కంది పంట అంతటా కోతలు సాగుతున్నాయని, ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవడానికి రైతు సేవా కేంద్రాల్లో కంది పంట రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో విఎఎ కె అశోక్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న తాళ్లూరు ఏవో ప్రసాదరావు

కొనకనమిట్ల : సాగు భూమి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయధికారి ప్రసన్నరంగ లక్ష్మీ తెలిపారు. మండలంలోని తువ్వపాడు, రేగుమానుపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే నెంబరు, ఖాతా నెంబరు, విస్తీర్ణం సరిచూసుకుని వేలిముద్ర వేసి ధ్రువీకరించాలని అన్నారు. ఈనెల 24లోపు ఫార్మర్ రిజిస్టరీలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ ఉంటేనే వ్యవసాయ సేవలు పొందవచ్చని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే సత్వర పరిహారం పొందాలన్నా తప్పనిసరిగా ఈ గుర్తింపు సంఖ్య ఉండాలని తెలిపారు. నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవడంలో తోడ్పడుతుందన్నారు. కావున రైతులు ఆధార్ నెంబరు, ఆధారు నెంబర్‌కు లింక్ అయిన ఫోను నెంబరు, పట్టాదారు పాస్ పుస్తకం లేదా 1బి తీసుకొని మీకు దగ్గరలోని రైతు సేవా కేంద్రంకు వెళ్ళినట్లయితే ఫార్మర్ రిజిస్టరీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు ఎ సాయిలక్ష్మీ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న కెకెమిట్ల ఎఒ ప్రసన్నరంగలక్ష్మి

కార్మికుల పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-దర్శి

మున్సిపల్ ఉద్యోగ, కార్మికులకు గత ప్రభుత్వం వేతనాలు పెంచిందని, అవి ఇంత వరకు విడుదల కాలేదని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి కోటేశ్వరరావు కోరారు. మున్సిపల్ కార్మికుల పెండింగు వేతనాలు అమలు చేయాలని కోరుతూ స్థానిక నగర పంచాయతీ కమిషనర్ వై మహేశ్వరావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అఫ్కాష్ రద్దు పరుస్తూ బడా కంపెనీలకు, ఏజెన్సీలకు అప్ప చెబుతామని మంత్రివర్గ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని అన్నారు. జిల్లాలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను ఏ ప్రభుత్వం వచ్చిన పట్టించుకున్న నాధుడే లేడని అన్నారు. ప్రభుత్వాలు మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువులు ధరలు పెరగడంతో మున్సిపల్ కార్మికులు కుటుంబ పోషణ జరగక అర్ధాకలితో జీవిస్తున్నారని



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆవేదన వ్యక్తం చేశారు. గత సమ్మె కాలంలో ఔట్సోర్సింగ్ కార్మికుల పెండింగ్ వేతనాలు, ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని కమిటీ వేశారని, ఆ కమిటీ నివేదిక ఆధారంగా జీతాలు చెల్లించాలని కోరారు. కనీసం వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. మున్సిపల్ కార్మికుల సర్వీస్ క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్మిక నాయకులు ఇత్తడి ఇర్మియ, ఇత్తడి ఇస్సాకు, గర్నెపూడి దావీద్, చాట్ల బాబురావు, ఇత్తడి ఏసోబ్ పాల్గొన్నారు.


స్టేషన్ తనిఖీ చేస్తున్న డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్

ప్రజలతో స్నేహభావంతో ఉండాలి

ప్రజాశక్తి - వెలిగండ్ల

పోలీసులు ప్రజల పట్ల ఆప్యాయంగా, స్నేహభావంతో మెలగాలని, అప్పుడే పోలీసుల పట్ల ప్రజల్లో గౌరవభాలు పెరుగుతాయని కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లోని డ్రోన్ల పనితీరు, పరిసరాలు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఐ మధుసూదనరావు పోలీస్ సిబ్బందితో తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
బుధవారం 19 ఫిబ్రవరి 2025

బోధనా నైపుణ్యాలు పెంచుకోవాలి : సిడిపిఒ

ప్రజాశక్తి - పర్చూరు

అంగన్‌వాడీలు బోధనలో నైపుణ్యాలు పెంచుకోవాలని సిడిపిఒ జి సుభద్ర తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉమెన్ డెవలప్మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, సర్వ శిక్ష అభియాన్ , స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 120 రోజుల జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ కోర్సు మొదటి విడత శిక్షణా కార్యక్రమం స్థానిక యుపి స్కూల్‌లో మంగళవారం ప్రారంభించారు . మొదటి విడత శిక్షణ ఈనెల 18 నుండి 20 వరకు , రెండో విడత 22 నుంచి 25 వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ అంగన్‌వాడీలు మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పూర్వ ప్రాథమిక విద్యను నాణ్యమైన ప్రమాణాలతో, నాణ్యమైన బోధన అభ్యసనాలను నేర్చుకోవాలన్నారు. అందుకు ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్చూరు ఎంఇఒ-1 వి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రీస్కూల్ కార్యక్రమాల ద్వారా నాణ్యమైన విద్యను అందించి అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతం చేయాలన్నారు. తద్వారా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు కూడా బలోపేతం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పి భవనం చింపారెడ్డి ,ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ , అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



పర్చూరులో మాట్లాడుతున్న సిడిపిఒ

భట్టిప్రోలు : బాల్య సంరక్షణ, విద్యపై అంగన్‌వాడీలు అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ ఎస్. వెంకటరమణ తెలిపారు. అంగన్‌వాడీలకు జ్ఞాన జ్యోతి120 రోజుల సర్టిఫికెట్ కోర్సును పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈనెల 18 నుంచి 25 వరకూ ఈ కోర్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అంగన్‌వాడీ కంద్రాల బలోపేతానికి స్వచ్ఛంద, సేవా సంస్థలు, ప్రాజెక్టులు సహకారంతో పిల్లల సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి శిక్షణ దోహదపడుతుందన్నారు. ఎంఇఒ నీలం దేవరాజ్ మాట్లాడుతూ సపోర్టు ఆంధ్ర లెర్న్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రోగ్రాం ద్వారా 4 విడతలుగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రథమ్ సంస్థ ద్వారా ఆరు రోజుల పాటు ఆఫ్ లైన్ శిక్షణను మంగళవారం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాచర్ల మోహనరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజరు సంపూర్ణ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


కొల్లూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు ఆరు రోజులపాటు నిర్వహిస్తున్న సాల్ట్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భ:గా ఎంఇఒ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఆరురోజుల పాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజరు విజయలక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నిజాంపట్నం : పూర్వ ప్రాథమిక విద్యపై నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులను అంగన్‌వాడీలకు వినియోగించుకోవాలని ఎంఇఒ శోభా చంద్ తెలిపారు. నిజాంపట్నం నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణా తరగుతులను ఆయన కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగనవాడీలకు 120 రోజుల పాటు సర్టిఫికెట్ కోర్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆరు రోజులు వత్యంత్ర శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 శేషు గోపాలం, జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శివన్నారాయణ , పల్లపట్ల సిడిపిఒ అనసూయ, డిఆర్‌పిలు గణేష్ రావు, తులసీదాసు, ప్రసూన ,గౌరీ, జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె : మహిళా అభివద్ధి శిశు సంక్షేమ విభాగం, స్కూల్ ఎడ్యుకేషన్, వారి ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్,ఉల్లిపాలెం జడ్‌పిహెచ్ఎస్ స్కూల్‌లో జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు పై అంగన్‌వాడీలకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిప్యూటీ డిఇఒ కె.సురేష్ , ఎంఇఒ రత్న శ్రీధర్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా అభ్యసనను బలోపేతం చేయటం, పిల్లలకు ఆటలు, పాటలు ద్వారా అభ్యాసన చేయడం, తల్లితండ్రులకు సమాజం భాగస్వామ్యం, తదితర అంశాలపై సిడిపిఒ ఎం.సుచిత్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పుల్లారావు, టి సురేష్,ప్రభాకర్, శివ జ్యోతి, సూపర్ వైజర్, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో మాట్లాడుతున్న ఎంపిడిఒ



నిజాంపట్నంలో మాట్లాడుతున్న ఎంఇఒ



రేపల్లెలో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ



మాట్లాడుతున్న ఎపిఎం అంజిబాబు

విఒఎలతో సమీక్ష

ప్రజాశక్తి -వేటపాలెం

స్త్రీనిధి రుణాల మంజూరు టార్గెట్ , రికవరీ పై దృషిసారించాలని ఎపిఎం కాకి అంజిబాబు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల పరిధిలోని పొదుపు సంఘాల మహిళలు, విఒఎలతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ నెలవారీ నిర్వహించే మొబైల్ కీపింగ్ గురించి ఆరా తీశారు ఎస్‌హెచ్‌జి గ్రేడింగ్ సిఐఎఫ్ ప్రాజెక్టులోని కాంపోనెంట్స్‌పై సమీక్షించారు. కిచెన్ గార్డెన్స్, కాంఫోర్స్ పిట్స్ సర్వే నిర్వహించి అర్హులను గుర్తించాలన్నారు. ఎన్‌ఆర్‌ఎల్‌ఎం ద్వారా లోకోస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లోకోస్ టిఒ టి. శోభన్ బాబు, సిసిలు చిన్నారావు, విజయలక్ష్మి, అనురాధ, డ్వాక్రా గ్రూపుల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అమ్మితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర ప్రభుత్వం గంజాయి వ్యవస్థను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చీరాల రూరల్ సిఐ శేషగిరిరావు తెలిపారు. గంజాయి అమ్మిన, కొనినా వారిపై పిడి యాక్టు పెట్టనున్నట్లు తెలిపారు. ఎస్‌పి తుషార్ డూడి ఆదేశాల మేరకు చీరాల డిఎస్‌పి మోయిన్ ఆధ్వర్యంలో చీరాల రూరల్ సిఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది గంజాయి నిర్మూలన చర్యలలో భాగంగా పాత నేరస్తులు,గంజాయి కేసుల్లో ఉన్న వారి ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువత గంజాయి, మత్తుపదార్థాలకు బానిసలై జీవితాలను పాడు చేసుకుంటూ కుటుంబాలకు దూరం అవుతు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఓ ఇంటిలో సోదాలు చేస్తున్న సిఐ శేషగరిరావు, పోలీసు సిబ్బంది



ఇంకొల్లులో స్థానికులతో మాట్లాడుతున్న సిఐ మోయిన్

ఇంకొల్లు.: గంజాయి మొక్కలు పెంచినా, గంజాయి అమ్మినా నేరమేనని చీరాల డిఎస్‌పి మొహమ్మద్ మోయిన్ తెలిపారు. ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, వివిధ కేసుకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. పెండింగ్‌లో వున్న కేసుల పురోగతిపై తగు సూచనలు మరియు సలహాలు ఇచ్చారు. అనంతరం గతంలో గంజాయి కేసులల్లోని నిందితులను ఇళ్ళను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఎవరైనా గంజాయి అమ్మిన, కొనినా మరియు గంజాయి చెట్లను పెంచిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమానికి ఇంకొల్లు సిఐ వైవి.రమణయ్య ,ఇంకొల్లు ఎస్ఐ జి. సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రూపాదేవి

ఉచిత దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- భట్టిప్రోలు : స్థానిక భట్టిప్రోలు టిఎం. రావు ఉన్నత పాఠశాలలో మాచర్ల వెంకటేశ్వరరావు మరియు సిబార్ దంత వైద్యశాల వారి సంయుక్త సహకారంతో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు డాక్టర్ గార్లపాటి రూపాదేవి దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు పేస్టు, బ్రష్ లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాం డెంట్ పులికొండ మల్లికార్జునరావు, ప్రధానోపాధ్యాయుడు సిహెచ్. రామకోటేశ్వరరావు, కోఆర్డినేటర్ సిహెచ్‌వి. ఉమామహేశ్వరరావు, డాక్టర్ ద్వారకానాథ్, వైద్యశాల సిబ్బంది, బిఎఫ్ఎ సభ్యులు బొలిశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి శివరాం ప్రసాద్ ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -యద్దనపూడి : మండల పరిధిలోని యనమదల గ్రామంలో పంచాయతీ అధికారులు మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సైడ్ కాలువల్లో పేరుకు పోయిన పూడిక తీయించి కాలువలు శుభ్రం చేయించారు. చెత్త చెదారాలను ఊరు బయటకు తరలించారు. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఇఒపిఆర్‌డి వి.కష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ.రాణి,గ్రామ ప్రజాప్రతినిధులు దొడ్డ వీరభద్రయ్య, శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా భాషా దినోత్సవం

ప్రజాశక్తి -వేటపాలెం : మండల పరిధిలోని పందిళ్ళపల్లి హైస్కూల్లో మంగళవారం భాషా దినోత్సవ ఉత్సవాలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మెడబలిమి శేఖర రావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష కార్యాలయం ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 18 నుండి 21 వరకూ నాలుగు రోజులపాటు భాషా దినోత్సవ ఉత్సవాలు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇంగ్లీష్, హిందీ, ట్రైబల్ లాంగ్వేజ్, తెలుగు భాషాపై కార్యక్రమాలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగానే ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయుడు నరసింహారావు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు, మనోవికాసం నిర్వాహకులు ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

'నక్ష'తో పట్టణాల్లో భూములు పదిలం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నక్ష' కార్యక్రమంతో పట్టణాలలో ప్రతి ఒక్కరి భూములు పదిలంగా ఉంటాయని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు తెలిపారు. స్థానిక సంస్థల్లో దేశవ్యాప్తంగా నక్ష కార్యక్రమంలో పలు స్థానిక సంస్థల్లో చేపట్టిన భూముల రీ సర్వేను మంగళవారం ఆయన ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రారంభించారు. రాష్ట్రం నుంచి 10 స్థానిక సంస్థలు ఈ సర్వేలో ఎంపిక కాబడ్డాయని, అందులో ఒంగోలు ఉండటం హర్షనీయమని ఆయన తెలిపారు. ఎవరైనా భూములు కోల్పోయి ఉంటే వారి భూములు ఈ సర్వే ద్వారా తిరిగి వెనక్కి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఎవరి భూములు ఆక్రమించబడినా తిరిగి వెనక్కి వస్తాయని భరోసా ఇచ్చారు. ఈ సర్వే కోసం ప్రభుత్వం రూ.30 కోట్లు నిధులు విడుదల చేసిందని వివరించారు. ఒంగోలులో ఈ సర్వే విజయవంతం కావాలని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకష్ణ సర్వే ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, పలువురు కార్పొరేటర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదల జీవనోపాధికి రుణాలివ్వాలి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నిరుపేదల జీవనోపాధి కోసం ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజిపి) ద్వారా రుణాలు విస్తతంగా మంజూరు చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పిఎంఈజిపి, పాడి గేదెలు, జీవనోపాధి రుణాల మంజూరుపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టర్ చాంబర్లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది రుణ లక్ష్యాలను చేరుకోలేకపోవడం ఏమిటని అధికారులను నిలదీశారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలు ఉల్లంఘించరాదని ఆదేశించారు. రుణ సదుపాయం కల్పించడంలో బ్యాంకర్లు సహకరించాలన్నారు. పీఎం ఈజిపి కింద ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ కింద 36 యూనిట్ల స్థాపించాలని లక్ష్యం కాగా, కేవలం 16 మాత్రమే మంజూరు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. పొదుపు మహిళలకు సాధారణంగా పంపిణీ చేసే బ్యాంకు రుణాలు సైతం లక్ష్యాలు చేరుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. 23 వేల సంఘాలకు రూ.152 కోట్ల శ్రీ నిధి రుణాలను మంజూరు చేయాలన్న లక్ష్యం పూర్తి కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు కేవలం 19,649 సంఘాలకు రూ.136 కోట్లు మాత్రమే రుణంగా ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. వెలుగు అధికారులు నిర్లిప్తంగా ఉండడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. పది రోజులలో పురోగతి కనిపించకపోతే సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం శ్రీనివాసరావు, డి ఆర్ డి ఏ పిడి పద్మ, చేనేత జౌళి శాఖ ఏడి నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుకు సీజ్ చేసిన అధికారులు

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండలంలోని వేంపాడులో కల్తీ తవుడు తయారుచేస్తున్న రైస్‌మిల్లుకు అధికారులు మంగళవారం సీల్ వేశారు. మంగళవారం నాడు 'ప్రజాశక్తి'లో 'మనుషులా..పశువులా..' శీర్షికన వచ్చిన నకిలీ తవుడుపై కథనానికి పశుసంవర్ధక శాఖ దర్శి ఏడిఏ ఎ.పురుషోత్తమరాజు, ముండ్లమూరు పశువైద్యాధికారి ఎం.విజయలక్ష్మి స్పందించారు. వేంపాడు గ్రామంలో కల్తీ జరిగిన రైస్ అండ్ ఫ్లోర్ మిల్లును అధికారులు పరిశీలించారు. మిల్లుకు సీల్ వేసి.. సీజ్ చేశారు.



సీల్ వేస్తున్న అధికారులు



జగన్‌ను కలిసిన బూచేపల్లి

మాజీ సిఎం, వైసిపి అధినేత జగన్‌ను జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తాడేపల్లిలోని కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

నిద్రపోతున్నారా.?

డబ్బులు తీసుకొని తెలియనట్లున్నారా?

- అభివృద్ధి పనులు కన్వర్షన్ లేకుండా ఎలా చేస్తారు.?
- రియలర్లు, అధికారులపై తహశీల్దార్ రవిశంకర్ ఆగ్రహం
- ఆక్రమణలపై కదిలిన రెవెన్యూ యంత్రాంగం



ఆక్రమిత స్థలాలను పరిశీలిస్తున్న తహశీల్దార్ రవిశంకర్

ప్రజాశక్తి-కనిగిరి

కన్వర్షన్ లేకుండా అభివృద్ధి పనులు ఎలా చేస్తారని కనిగిరి తహశీల్దార్ ఏవి.రవిశంకర్ రియల్టర్లపై మండిపడ్డారు. కన్వర్షన్ లేకుండా, మున్సిపల్ అనుమతులు లేకుండా ఎలా ప్లాట్లు వేస్తారని, టౌన్ ప్లానింగ్ విభాగం బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు ఎలా ఇస్తుందని, ఇంత తతంగం జరుగుతుంటే వీఆర్వోలు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు నిద్రపోతున్నారా.? లేక రియల్ వ్యాపారులు ఇచ్చే డబ్బులు తీసుకొని ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో గల పెద్ద చెరువు వాగులు ఆక్రమణలపై 'ఆక్రమణలతో కనుమరుగవుతున్న చెరువులు, వాగులు' , 'కొనసాగుతున్న ఆక్రమణలు' శీర్షికన వరుస కథనాలు సోమవారం, మంగళవారాల్లో 'ప్రజాశక్తి' దినపత్రికలో ప్రచురితమయ్యాయి. దీంతో రెవెన్యూ యంత్రాంగం కదిలింది. తహశీల్దార్ ఏవి.రవిశంకర్ తన సిబ్బందితో కలిసి పెద్దచెరువు అలుగు, వాగు ఆక్రమణలను మంగళవారం పరిశీలించారు. వెన్నెల అపార్ట్‌మెంట్ వెనుక వైపు వాగు ఆక్రమణను పరిశీలిస్తూ కన్వర్షన్ లేకుండా అభివద్ధి పనులు ఎలా చేస్తారని, సరిహద్దు ప్రహరీలు ఎలా నిర్మిస్తారని రియల్ వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు చేస్తున్న యంత్రాలను స్టేషన్‌కు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. కన్వర్షన్ అనుమతి పొందే వరకు ఎలాంటి డెవలప్మెంట్ చేయవద్దని, నిలిపివేయాలని రియల్ వ్యాపారులకు సూచించారు. తక్షణమే వాగును సర్వే చేయాలని ఆక్రమణలు ఉంటే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కన్వర్షన్ చేయించుకోకుండా డెవలప్‌మెంట్ పనులు చేస్తున్నందుకు ఐదు శాతం ఫైన్ వేయడం జరుగుతుందని రియల్ వ్యాపారులను హెచ్చరించారు. శంఖవరం అభయాంజనేయస్వామి ఆలయం సమీపంలో వెంచర్‌ను తహశీల్దార్ పరిశీలించారు. కన్వర్షన్ ఉన్న మేరకే అభివద్ధి చేసుకోవాలని, కన్వర్షన్ లేకుండా ఉన్న వాగు వైపు తోలిన మట్టిని తొలగించాలని రియల్ వ్యాపారులకు సూచించారు. అభయాంజనేయ స్వామి పక్కన గల అనధికారిక లేఅవుట్‌ను పరిశీలించారు.

తహశీల్దార్ ఆదేశాలు బేఖాతరు..

తహశీల్దార్ ఏవి రవిశంకర్ తన సిబ్బందితో కలిసి వెన్నెల అపార్ట్మెంట్ వెనుక వాగు ఆక్రమణను పరిశీలిస్తూ కన్వర్షన్ లేకుండా నిర్మాణాలు చేపట్టడానికి వీలులేదని నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ రియల్ వ్యాపారులు లెక్కచేయకుండా నిర్మాణాలను యథేచ్ఛగా కొనసాగించడం గమనార్హం. రియల్ వ్యాపారులు వారు వేసుకున్న బౌండరీ కాకుండా వాగు నుంచి అడ్డంగా దారి ఏర్పాటు చేసుకునేలా నిర్మాణ పనులను చేపట్టారు. తమకేం తెలియదన్న రీతిలో ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులున్నారు. వాగును ఆక్రమించి వంతెనలు, నిర్మాణాలు చేపడుతున్న తమకేం పట్టదన్నట్లు ఆ శాఖల అధికారులు వ్యవహరిస్తున్న తీరును సిపిఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు తహశీల్దార్ ఏవి రవిశంకర్ దృష్టికి తీసుకొచ్చారు. చెరువు అలుగు వాగులను సమగ్రంగా సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలని, ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని కోరారు.

దృష్టి లోపాలు రాకుండా

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి..

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పాఠశాల విద్యార్థులు దష్టి లోపాలు రాకుండా చిన్నప్పటి నుంచి పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు తప్పనిసరిగా ప్రతిరోజు గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. రక్తహీనతను తగ్గించడానికి ఐరన్ మాత్రలను విద్యార్థులు తీసుకోవాలని చెప్పారు. పాఠశాల విద్యార్థులు చదువుకునేటప్పుడు సరైన వెలుతురు ఉన్నచోట కూర్చుని చదువుకోవాలని, ప్రతిరోజూ నిద్రలేచిన వెంటనే విద్యార్థులు కళ్ళు శుభ్రం చేసుకోవాలన్నారు. దానితో పాటు కంటికి సంబంధించిన ఎక్సర్‌సైజ్‌లను కూడా విద్యార్థులు తప్పకుండా చేయాలని చెప్పారు. పాఠశాల విద్యార్థులు మొబైల్స్ చూడడం, టీవీలు చూడడం తగ్గించుకొని ఆటలాడుకోవాలని చెప్పారు. పిల్లలు చదువుకునేటప్పుడు తలనొప్పికి గురవ్వడం, సక్రమంగా చూడలేక పోవడం వంటి లక్షణాలను తల్లిదండ్రులు వెంటనే గుర్తించి వారికి అవసరమైన కంటి వైద్య పరీక్షలు చేయించాలని చెప్పారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం 3 వేల మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం 7 లక్షలా 50 వేల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. పాఠశాల విద్యార్థులు ఈ కంటి అద్దాలను తీసుకొని చక్కగా చదువుకొని మంచి మార్కులను సాధించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాల విద్యార్థులకు కంటి అద్దాలు అమర్చి పుస్తకాన్ని చదివించి చూశారు. కంటి అద్దాలు తీసుకున్న తర్వాత విద్యార్థులకు చదువుకోవటం ఎలా ఉందని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దానికి విద్యార్థులు స్పందిస్తూ అద్దాలు పెట్టుకున్న తర్వాత చక్కగా చదువు కుంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, తహసిల్దార్ సలోమి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థిని మాటలకు చలించిన కలెక్టర్

తక్షణమే రూ.10 వేల ఆర్థిక సాయం

అగ్నిప్రమాదంలో పూర్తిగా ఇల్లు కాలిపోయిన విద్యార్థిని వేమినేని వెంకట వసంతకు తక్షణమే కలెక్టర్ జె. వెంకటమురళి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా కలెక్టర్ మంగళవారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో అద్దాలు తీసుకోవడానికి వచ్చిన వెంకట వసంతను కలెక్టర్ 'అమ్మా.. ఈ రోజు స్కూలుకు యూనిఫాం వేసుకొని రాలేదు ఎందుకని.?' అని అడిగారు. బాపట్ల రైల్ పేటలో తమ నివాసం ఉందని, గత డిసెంబర్ 7వ తేదీన జరిగిన అగ్నిప్రమాదంలో తమ ఇల్లు కాలిపోయిందని, స్కూల్ యూనిఫామ్ కూడా కాలిపోవడంతో తనకు యూనిఫామ్ లేదని విద్యార్థిని కలెక్టర్‌కు తెలియజేశారు. దీంతో చలించిపోయిన కలెక్టర్ విద్యార్థిని వెంకట వసంతకు, వారి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ , బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహసిల్దార్ సలీమా పాల్గొన్నారు.



విద్యార్థినికి సాయం అందిస్తున్న కలెక్టర్